క్లుప్తంగా

కేజీబీవీలో అధికారుల విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

భీమిని: మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. కాస్మెటిక్ వస్తువులు కొనలేదని ఉపాధ్యాయురాలు సుజాత నలుగురు విద్యార్థులను చితకబాదిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎంఈవో కృష్ణమూర్తి విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి శారద, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

మంచిర్యాల కార్పొరేషన్‌లో 65శాతం పన్ను వసూలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో పన్ను వసూళ్ల చివరి రోజున రూ.55లక్షలను మున్సిపల్ అధికారులు వసూలు చేశారు. రూ.26.88కోట్లు పన్ను డిమాండ్ ఉండగా, చివరిరోజు వరకు రూ.17కోట్లు వసూలు చేసినట్లుగా రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీంతో కార్పొరేషన్ ఆస్తి పన్ను మొత్తం 65శాతం వసూలైంది. పన్ను బకాయిల్లో వడ్డీకి 90శాతం మాఫీని ప్రభుత్వం ప్రకటించినా, ఆశించినంతగా పన్ను వసూళ్లు కాకపోవడం, కేవలం 65శాతం మాత్రమే పన్ను వసూలుతో దాదాపుగా రూ.10కోట్లు ఇంకా పన్ను బకాయిలు వసూలు చేయాల్సిన పరిస్థితి.

సమస్యలు పరిష్కరించాలి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు రైల్వేలైన్ సైడింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ సాయికృష్ణారెడ్డి తెలిపారు. రైల్వేలైన్ సైడింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలివ్వాలని, అర్హత కలిగిన కార్మికులకు ప్రమోషన్లు కల్పించాలని, కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు రాజు, సంతోశ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

పాతమంచిర్యాల: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు గడువు పొడగించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు నందిపాటి రాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించారని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాలలో అభ్యర్థులు సర్వర్ డౌన్ కారణంగా నిరీక్షించాల్సి వస్తుందని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు జారీ కావడం లేదని, సమస్యను గుర్తించి గడువు తేదీని పొడగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పోయిన పర్స్ అందజేత



చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్స్ అనిత విధులు ముగించుకొని ఆటోలో ఇంటికి వెళ్లింది. ఆటో దిగిన తర్వాత పర్స్ కన్పించలేదు. వెంటనే చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ దేవేందర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీసీ ఫుటేజీ ద్వారా గాంధీచౌక్ ప్రాంతంలో పర్స్ ఉన్నట్లు గుర్తించారు. హోమ్‌గార్డు ఖదీర్ సాయంతో పర్స్‌ను పోలీసుస్టేషన్‌లో బాధితురాలు అనితకు సీఐ అందజేశారు. పర్స్‌లో బంగారు రింగు, పదివేల రూపాయలు ఉన్నాయి. గంటల వ్యవధిలో పర్స్‌ను గుర్తించిన హోంగార్డును సీఐ అభినందించారు.

సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: పట్టణంలో వన్ మెడిహబ్ సహకారంతో సోమవారం మొబైల్ మెడికల్ క్యాంపు నిర్వహించగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్యాంపులో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు, పట్టణ ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్, వైద్యాధికారి రమేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గూడెంలో కొనసాగుతున్న మాలధారణ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ హనుమాన్ ఆలయం వద్ద హన్మాన్ దీక్షా మాలధారణ కార్యక్రమాలు మూడోరోజు కొనసాగాయి. సోమవారం 602మంది మాలధారణ చేసుకున్నారు. మాలధారణ చేసుకున్న భక్తులు గుట్టపై గల శ్రీసత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి.



శ్రీరామ పట్టాభిషేకం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలో ప్రదర్శిస్తున్న చిరుతల రామాయణం సోమవారంతో ముగిసింది. శ్రీరాముడు, సీతాదేవి అయోధ్యకు తరలివెళ్లి రాముని పట్టాభిషేకం నిర్వహించే సన్నివేశాలను కళాకారులు ప్రదర్శించారు. మహిళలు మంగళహారతులతో వచ్చి శ్రీరామ పట్టాభిషేకాన్ని తిలకించారు.



ఘనంగా గణగోర్ శోభాయాత్ర

చెన్నూర్: పట్టణంలో మార్వాడీ సమాజానికి చెందిన మహిళలు గణగోర్‌ను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో శివపార్వతుల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. హోలీ నుంచి 16రోజుల పాటు శివపార్వతులకు పూజలు నిర్వహిస్తారు. భర్తలు ఆరోగ్యంగా ఉండాలని వివాహితలు, వివాహాలు కావాలని అమ్మాయిలు శివపార్వతులను కొలుస్తారు.



నెన్నెల: అలయ్‌బలయ్ చేసుకుంటున్న యువకులు



చెన్నూర్: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే



వేమనపల్లి: వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్



జైపూర్: వేడుకల్లో చిన్నారులు, పెద్దలు




తాండూర్: శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



రామకృష్ణాపూర్: ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు



భీమిని: ముత్తపూర్‌లో...



నమాజ్ చేస్తున్న చిన్నారి

ఈద్ ముబారక్

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాల్లో ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ఆచరించారు. సాంప్రదాయ దుస్తువులు ధరించి సుగంధద్రవ్యాలు పూసుకొని, కళ్లకు సుర్మా, తలకు టోపి పెట్టుకొని పిల్లలు, పెద్దలు, వృద్ధులు అందరూ నమాజ్‌లో పాల్గొన్నారు. మత గురువులు పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ దానధర్మాలు చేయాలని సూచించారు. నమాజ్ అనంతరం ఆలింగనాలు చేసుకొని పరస్పరం ఈద్‌ముబారక్ చెప్పకున్నారు. పండుగ సందర్భంగా ఇళ్లకు వచ్చిన అతిథులకు సాంప్రదాయ వంటకం సేమియా వడ్డించి ఆత్మీయత పంచుకున్నారు. ముస్లిం సమాజానికి ఇబ్బంది కలిగించే విధంగా వక్ఫ్‌బోర్డు నిబంధనలను మారుస్తూ కేంద్రం బిల్లు రూపొందించటాన్ని నిరసిస్తూ ముస్లింలు పలుచోట్ల నల్లరిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూర్, మందమర్రి, జైపూర్, రామకృష్ణాపూర్ ఈద్గాల వద్ద ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.



కాసిపేట: ముత్యంపల్లిలో...



దండేపల్లి: శుభాకాంక్షలు చెప్పుకుంటున్న ముస్లింలు



తాండూర్: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జన్నారం: పొనకల్ ఈద్గా వద్ద ప్రార్థనలు



బెల్లంపల్లి: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



భీమారంలోని ఈద్గా వద్ద..

బొగ్గు ఉత్పత్తిలో యూనియన్ ప్రతినిధుల పాత్ర కీలకం

మందమర్రిరూరల్: బొగ్గు ఉత్పత్తిలో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధుల పాత్ర కీలకమని ఏరియా జీఎం దేవేందర్ పేర్కొన్నారు. ఏరియాకు సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు యూనియన్ ప్రతినిధులు సహకరించాలని కోరారు. సోమవారం గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులతో నిర్వహించిన నిర్మాణాత్మక సమావేశంలో జీఎంకు యూనియన్ ప్రతినిధులు పలు సమస్యలు వివరించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. ఏరియాలోని తమ పరిధిలోని సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తానని, మిగిలిన సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్,



మాట్లాడుతున్న జీఎం

పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, ఐఈడీ రాజన్న, ఎస్ఈ(సివిల్) రాము, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్‌అలీ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ కార్మికులకు ఘన సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ, ఎస్సార్పీ 3, 3ఏ, ఆర్కే7 గనులపై రిటర్డ్ అయిన ఉద్యోగులను సోమవారం అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆర్కే 7 గనిపై జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి శాలువాతో సత్కరించారు. కంపెనీలో వారు చేసిన సేవలను కొనియాడారు.

ఆర్కే 6 గనిపై ఉగాది ఉత్సవాలు

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే 6 గనిలోని మైసమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఉగాది నుంచి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించడం ఇక్కడ ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం గనిపై అమ్మవారి ఆలయంలో గని మేనేజర్ తిరుపతి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

■ బొగ్గుబాయి వార్తలు

మందమర్రి ఏరియాలో 78శాతం బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 78శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మందమర్రి ఏరియాకు గత ఆర్థిక సంవత్సరం 34.6లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించగా, 27.1ఉత్పత్తి చేశామని తెలిపారు. కేకే 5గని, కాసిపేట, శాంతిఖని, ఆర్కే ఓసీ, కేకే ఓసీ బొగ్గు ఉత్పత్తి చేశామని వివరించారు. మార్చిలో అన్ని గనుల్లో 2.54 లక్షల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 2,56,952 టన్నులతో 101శాతం ఉత్పత్తి జరిగిందని వెల్లడించారు. వచ్చే 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంస్థ 27.8 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించిదని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, ఐఈడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, డీవైపీఎం మైత్రేయ బంధు, డీవైజీఎం(సివిల్) రాము పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు

మంచిర్యాలఅర్బన్: జిల్లా టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్, సమిష్టి చేయూత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కూచిపూడి వైభవం పేరిట నిర్వహించిన మంచిర్యాల జిల్లాకు చెందిన కూచిపూడి నృత్య కళాకారులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. స్థానిక పద్మావతి గార్డెన్స్‌లో సోమవారం సంగీత సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రామలింగశాస్త్రి, నాట్య విశారద మాచిరాజు రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో 350మంది కళాకారులు ఏకకాలంలో తొమ్మిది నిమిషాల పాటు నృత్యం ప్రదర్శించి తెలుగుబుక్ ఆఫ్ రికార్డులోకి ఎక్కారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం కళాకారులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జిల్లా కేంద్రంలో కళాకారుల కోసం కళాభవన్ ఏర్పాటుకు కృ



ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కళాకారులు

షి చేస్తానన్నారు. కూచిపూడి నృత్యం తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకోవటం శుభపరిణామన్నారు. కూచిపూడి నృత్య కళాకారులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ పత్రాలను అందజేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు కో–ఆర్డినేటర్ కాసం సంతోష్, టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్ గౌరవ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, గౌరవ సలహాదారుడు రాజేష్‌నేతకాని, నిర్వాహకుడు రాంబాబు పాల్గొన్నారు.

బుగ్గ మల్లన్న శిఖర ప్రతిష్ట

భీమిని: స్థానిక బుగ్గ మల్లన్న ఆలయంలో సోమవారం శిఖర కలశ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. అచ్చులాపూర్‌కు చెందిన వేద పండితులు అప్పాల శ్యామ్‌ప్రణీత్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

రూ. 50,116 విరాళం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి గ్రామానికి చెందిన గోళ్ల చంద్రయ్య దంపతులు రూ.50,116 ఆలయ కమిటీకి సోమవా రం విరాళంగా అందించారు.

సంక్షిప్త వార్తలు

ఆలుగామ బీట్ అధికారికి పదోన్నతి

కోటపల్లి: మండలంలోని ఆలుగామ ఫారెస్టు బీట్ ఆధికారిగా విధులు నిర్వర్తిస్తున్న రాజేందర్‌కు పదోన్నతి లభించింది. జిల్లా ఫారెస్టు అధికారి ఆశీష్‌సింగ్ చేతుల మీదుగా పదోన్నతి పత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా తోటి సిబ్బంది అభినందించారు.

'విద్యారంగంపై నిర్లక్ష్యం'

మంచిర్యాలఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై నిర్లక్ష్యం చూపుతున్నాయని సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో సోమవారం పీడీఎస్‌యూ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ఇన్‌చార్జి బ్రహ్మానందం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి చరణ్, డి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

కాసిపేట: మండలంలోని ఎనిమిది మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా, ఆ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ లబ్ధిదారులకు అందజేశారు.

బీసీ పోరు గర్జనకు తరలిన నాయకులు

పాతమంచిర్యాల: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌లతో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న ఢిల్లీలో నిర్వహించే బీసీ పోరుగర్జన సభకు జిల్లా నుంచి బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ నాయకులు సోమవారం ఢిల్లీకి పయనమయ్యారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలకంఠేశ్వర్ రావు, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్, బీసీ సంఘాల నాయకులు 100మంది ఉన్నారు.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఆరేవాడలో రూ.8లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ ఆరోపించారు. మట్టి కలిసిన ఇసుక వాడుతున్నారని, రోడ్డు కొలతలు తగినట్లు ఉండటం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు, క్వాలిటీ కంట్రోలర్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు మధుకర్, అజయ్, స్వామి, మధునయ్య పాల్గొన్నారు.